ముడా స్కామ్‌లో సిద్ధరామయ్య భార్య విచారణ

నాలుగున్నర గంటలు ప్రశ్నించిన లోకాయుక్త పోలీసులు

మైసూరు, అక్టోబర్ 25: మైసూరు అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ముడా) కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతిని లోకాయుక్త పోలీసులు విచారించారు. మైసూరులో శుక్రవారం నాలుగున్నర గంటల పాటు విచారణ జరిగింది. ముడా తనకు పరిహారంగా కేటాయించిన 14 స్థలాల గురించి పోలీసులు ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను పోలీసులకు బీఎం పార్వతి సమర్పించినట్టు తెలుస్తున్నది. కాగా, తక్కువ విలువైన భూమిని ముడాకు అప్పగించి, పరిహారంగా ఖరీదైన 14 స్థలాలను పొందారని సిద్ధరామయ్య, పార్వతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 27న లోకాయుక్త పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కాగా, ఈ కేసు నేపథ్యంలో ఇటీవలే వివాదాస్పద స్థలాలను బీఎం పార్వతి తిరిగి ముడాకు అప్పగించారు.

మహారాష్ట్రలో 5 సీట్లు ఇవ్వాల్సిందే

లేదంటే 25 స్థానాల్లో పోటీ చేస్తాం

ఎంవీఏకి సమాజ్‌వాదీ హెచ్చరిక

ముంబై: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తమకు 5 స్థానాలను ఇవ్వాలని, లేదంటే 25 స్థానాల్లో పోటీ చేస్తామని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి సమాజ్‌వాదీపార్టీ హెచ్చరించింది. ఈ కూటమిలో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ), శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ) తోపాటు సమాజ్‌వాదీ పార్టీ కూడా భాగస్వామ్య పక్షమే. ఎస్పీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అబు అసిం అజ్మీ సీట్ల పంపకాలకు సంబంధించి శుక్రవారం శరద్ పవార్‌తో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. శనివారం మధ్యాహ్నం వరకు సీట్ల కోసం వేచి చూస్తామని తెలిపారు.

కేజ్రీవాల్‌పై దాడి!

బీజేపీ గూండాల పనే: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గూండాలు దాడి చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ శుక్రవారం ఆరోపించింది. ఆ పార్టీ నేత, ముఖ్యమంత్రి ఆతిశీ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, వికాస్‌పురిలో పాదయాత్ర చేస్తున్న కేజ్రీవాల్‌పై బీజేపీ గూండాలు దాడి చేశారని ఆరోపించారు. ఆప్‌ను, కేజ్రీవాల్‌ను ఎన్నికల్లో ఓడించలేమని బీజేపీకి తెలుసునని, అందుకే ఆ పార్టీ ఇటువంటి రోత రాజకీయాలకు పాల్పడుతున్నదని, ఆయనను హత్య చేయాలనుకుంటున్నదని మండిపడ్డారు. ఆప్ సీనియర్ నేతలు మనీశ్ సిసోడియా, సౌరభ్ భరద్వాజ్ కూడా ఇవే ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ తోసిపుచ్చారు.

ప్రపంచ సమస్యగా ఉద్యోగ కల్పన

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వాషింగ్టన్, అక్టోబర్ 25: ఉద్యోగాల కల్పన అనేది అత్యవసరమైన ప్రపంచ సమస్యగా మారుతున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆమె గురువారం ప్రపంచ బ్యాంకు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కొనసాగుతున్న ఆర్థిక ఎదురుగాలులు, సాంకేతికంగా సంభవిస్తున్న పెను మార్పులు జాబ్ మార్కెట్‌లో యువతకు అవసరమైన నైపుణ్యాలను మార్చేశాయని ఆమె పేర్కొన్నారు. గతంలో హరిత ఉద్యోగాలు, ఏఐతో ఉద్యోగాల ప్రభావం వంటి అంశాలపై ప్రపంచ బ్యాంకు అనేక అధ్యయనాలు చేసిందని ఆమె గుర్తు చేశారు. కొత్తగా వస్తున్న ధోరణుల ప్రభావం ఉద్యోగ కల్పన, ఉద్యోగాల కోతపై ఎలా ఉంటుందో గుర్తించేందుకు మరింత సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు, సరైన నైపుణ్యాలు అందించేందుకు గానూ డిమాండ్ ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు వివిధ దేశాలతో ప్రపంచ బ్యాంకు కలిసి పని చేయాలని ఆమె కోరారు.

అక్రమంగా అమెరికాలోకి..

- గంటకు 10 మంది భారతీయుల పట్టివేత
- గత సంవత్సరం 90 వేల మంది అరెస్టు
- దాదాపు సగం మంది గుజరాత్‌కు చెందినవారే

అహ్మదాబాద్, అక్టోబర్ 25: భారత్‌ను వీడి అమెరికాలో స్థిరపడాలనే కలను నెరవేర్చుకునేందుకు కొందరు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. ప్రమాదకర మార్గాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వేలాది మంది అరెస్టయి అక్కడి జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిలో ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌కు చెందినవారే ఎక్కువగా ఉంటున్నారు. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్(యూఎస్-సీబీపీ) డాటా ప్రకారం గత అమెరికా ఆర్థిక సంవత్సరం(అక్టోబర్ 1, 2023 నుంచి సెప్టెంబర్ 30, 2024) మధ్యకాలంలో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న 29 లక్షల మందిని భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. వీరిలో 90,415 మంది భారతీయులు ఉన్నారు. అంటే దాదాపు గంటకు 10 మంది భారతీయులు అక్రమంగా అమెరికాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తూ దొరికిపోతున్నారు. పట్టుబడ్డ భారతీయుల్లో గుజరాత్‌కు చెందిన వారే దాదాపు 50 శాతం మంది ఉన్నట్టు తెలుస్తున్నది.

మెక్సికో, కెనడా నుంచి..

అక్రమంగా అమెరికాలోకి వెళ్లేవారు మెక్సికో, కెనడా నుంచి ప్రవేశిస్తున్నారు. మెక్సికో నుంచి వెళ్లే దారిని డాంకీ రూట్ అంటారు. అయితే, మెక్సికోకు వెళ్లే ముందు అక్రమ వలస దారులను కొన్నిరోజులు ఏజెంట్లు దుబాయ్ లేదా టర్కీలో ఉంచుతున్నారని, ఈ సమయంలోనే అమెరికా నిఘా వేసి వీరిని అడ్డుకుంటున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఇప్పుడు ఎక్కువగా కెనడా నుంచి అమెరికాలోకి ప్రవేశిస్తున్నట్టు చెప్తున్నారు. చాలామంది కెనడాకు పర్యటక వీసాపై వెళ్లి అక్కడి నుంచి అమెరికా సరిహద్దు దాటుతున్నారని, ఇలాంటి వారు దొరికితే అమెరికా భద్రతా సంస్థలు మళ్లీ కెనడాలో వదులుతున్నట్టు చెప్తున్నారు. అయితే, ఇలా పట్టుబడే వారి కంటే గుట్టుగా సరిహద్దు దాటే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని తెలుస్తున్నది.

రెండేండ్లలో 29 వేల మంది మిస్సింగ్

ఆగ్నేయాసియాలో సైబర్ బానిసలుగా భారతీయ యువత

న్యూఢిల్లీ: విదేశాల్లో ఉద్యోగమంటే.. మంచి జీతం, జీవితం.. మన యువతలో ఉండే ఈ ఆకర్షణను సైబర్ నేరగాళ్లు అవకాశంగా మార్చుకుంటున్నారు. నకిలీ జాబ్ ఆఫర్లు ఇచ్చి దేశం కాని దేశంలో సైబర్ బానిసలుగా మారుస్తున్నారు. వారిని హింసిస్తూ వారితో సైబర్ మోసాలు చేయిస్తున్నారు. ఇప్పటివరకు ఇలాంటి మోసాలు జరుగుతున్నాయనే వార్తలు వస్తున్నప్పటికీ తాజా నివేదిక ఇది ఎంత తీవ్రంగా ఉందో బయటపెట్టింది. 2022 జనవరి నుంచి ఈ ఏడాది మే వరకు ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లిన దాదాపు 29 వేల మంది భారతీయుల ఆచూకీ గల్లంతయ్యిందని ఓ నివేదిక వెల్లడించింది. ఇందులో ఎక్కువమంది కంబోడియా, లావోస్ దేశాల్లో సైబర్ బానిసలుగా మారిపోయారని పేర్కొన్నది. థాయ్‌లాండ్, వియత్నాం వంటి దేశాలకు విజిటింగ్ వీసాలపై వెళ్లిన వారు కూడా ఇందులో పెద్ద సంఖ్యలో ఉన్నట్టు తెలిపింది. ఎక్కువగా వీసా ఆన్ అరైవల్ పద్ధతిలో వెళ్తున్న వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడించింది.

ఉద్యోగ ప్రకటనలతో ఆకర్షించి..

ఆగ్నేయాసియా దేశాల నుంచి పని చేస్తున్న సైబర్ మోసాల రాకెట్‌లు భారత్‌తో పాటు నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాల యువతను విదేశాల్లో ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియా ద్వారా ఆకర్షిస్తున్నాయి. నమ్మి వెళ్లిన యువకుల వీసాలు లాక్కొని వారితో రకరకాల సైబర్ మోసాలు చేయిస్తున్నాయి. ఏ దేశ ప్రజలను ఆ దేశం వారితో అయితేనే మోసగించవచ్చనే వ్యూహంతో వీరిని బలిచేస్తున్నాయి. జిన్ బె గ్రూప్, కింగ్స్ రోమన్స్ గ్రూప్, ప్రిన్స్ గ్రూప్ వంటి ముఠాలు ఇందులో ప్రధానమైనవని ఈ నివేదిక పేర్కొన్నది. ఈ ముఠాల నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మి వెళ్లే యువకులను మారుమూల ప్రాంతాల్లో పెట్టి కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా హింసిస్తున్నాయని తెలిపింది. సైబర్ బానిసలుగా మారిన వారిని రక్షించి తిరిగి స్వదేశాలకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు చర్యలు తీసుకోవాలని ఈ నివేదిక సూచించింది.

కెనడా వెళ్లే విద్యార్థులు జాగ్రత్త!

- *నాణ్యత లేని కాలేజీల కారణంగా లక్షలు వెచ్చించి చదివినా ఉద్యోగాలు రాని పరిస్థితి*
- *డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యలు*
- *కెనడాకు పంపడంపై తల్లిదండ్రులు బాగా ఆలోచించుకోవాలి*
- *భారత రాయబారి సంజయ్‌వర్మ*

న్యూఢిల్లీ: ఉన్నత చదువులు చదివేసి, పెద్ద ఉద్యోగాలు చేసేసి జీవితంలో స్థిరపడిపోవాలన్న ఆశతో కెనడా వెళ్లాలనుకునే వారికి ఇది హెచ్చరిక. లక్షలకు లక్షలు ఖర్చు చేసి కెనడా వెళ్లి.. నాణ్యతలేని కాలేజీల్లో చదివి ఉద్యోగాలు దొరక్క డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకున్న వారు ఎందరో ఉన్నారట. భారతీయ రాయబారి స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. తన హయాంలో వారానికి ఇద్దరు విద్యార్థులను బాడీ బ్యాగుల్లో భారత్ పంపిన సందర్భాలు ఉన్నాయని 2022 నుంచి కెనడాలో భారత రాయబారిగా పనిచేసిన సంజయ్‌వర్మ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. జీవితంలో వైఫల్యం చెందిన విద్యార్థులు కుటుంబ సభ్యులకు ఆ బాధను చెప్పుకోవడం మాని ఆత్మహత్యలు ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖలిస్తానీ వివాదంతో భారత్-కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతినడంతో ఈ నెల మొదట్లోనే ఆయన తిరిగి భారత్‌కు చేరుకున్నారు. భారత్-కెనడా మధ్య సంబంధాలు బాగున్నా సరే తమ పిల్లలను అక్కడికి పంపేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని తల్లిదండ్రులకు వర్మ సలహా ఇచ్చారు. 'భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటూ అక్కడికి వెళ్తారు. కానీ, బాడీ బ్యాగుల్లో తిరిగి ఇక్కడికొస్తున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అక్కడ కొన్నిసార్లు ఇరుకైన డార్మిటరీల్లో ఉంటున్నారని, కొన్నిసార్లు ఒక చిన్న రూములో 8 మంది నిద్రిస్తున్నారని తెలిపారు. కష్టపడి చదివి ఇంజినీరింగ్ పూర్తిచేశాక ఇంజినీర్‌గా మంచి ఉద్యోగం చేస్తాడని అనుకుంటామని, కానీ అక్కడ అతడిని ఓ క్యాబ్ డ్రైవర్‌గా, ఓ షాప్‌లో చాయ్ సమోసా అమ్ముకునే వ్యక్తిగా చూస్తామని చెప్పారు. ఆగస్టులో ప్రభుత్వం పార్లమెంటులో విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడాలో విద్యనభ్యసిస్తున్నారు.

భారత నిపుణులకు జర్మనీ వీసాలు 90 వేలకు పెంపు

న్యూఢిల్లీ: నైపుణ్య భారత శ్రామిక శక్తి పట్ల నమ్మకంతో వారికి జారీ చేసే వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించిందని ప్రధాని మోదీ వెల్లడించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విదేశీ పెట్టుబడిదారులకు భారత్ తప్ప మరొక ఉత్తమమైన దేశం లేదని.. భారత్ వృద్ధి పథంలో భాగం కావడానికి ఇది సరైన సమయమని అన్నారు. మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ద వరల్డ్‌లో భాగం కావాలని ఇన్వెస్టర్లకు పిలుపునిచ్చారు. భారత్ రికార్డు స్థాయిలో రోడ్లు, నౌకాశ్రయాలపై పెట్టుబడులు పెడుతున్నదని, ఇండో-పసిఫిక్ ప్రాంతం ప్రపంచ భవిష్యత్తుకు చాలా ముఖ్యమని అన్నారు.

ముద్రా రుణ పరిమితి 20 లక్షలకు పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ప్రధాన్ మంత్రి ముద్రా యోజన(పీఎంఎంవై) కింద ఇస్తున్న ముద్రా రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. తరుణ్ విభాగంలో గతంలో రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా చెల్లించిన వారికి కొత్తగా ఏర్పాటు చేసిన తరుణ్ ప్లస్ విభాగం కింద రూ.10 లక్షలు -20 లక్షల వరకు రుణాలు అందిస్తారు.

దేశవ్యాప్తంగా పశుగణన ప్రారంభం

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ శుక్రవారం 21వ పశు గణనను ప్రారంభించారు. మహమ్మారి వచ్చినపుడు పశువుల ఆరోగ్య భద్రతకు తగిన ఏర్పాట్లు చేయడం కోసం పాండెమిక్ ఫండ్ ప్రాజెక్టును కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పశు గణన కార్యక్రమంలో 16 జాతులకు చెందిన 219 దేశవాళీ పశు, పక్షుల సమాచారాన్ని సేకరిస్తామన్నారు. పశువుల ఆరోగ్య భద్రత, పశు సంవర్ధక విధానాలను సరైన రీతిలో రూపొందించేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందన్నారు.

ఎల్‌ఏసీ ఘర్షణ ప్రాంతాల నుంచి బలగాలు వెనక్కి

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు స్వస్తి పలికి శాంతియుత పరిస్థితులు నెలకొల్పడానికి భారత్, చైనా తొలి అడుగు వేశాయి. రెండు ప్రధాన ఘర్షణ ప్రాంతాలైన డెమ్‌చోక్, దెప్సాంగ్ నుంచి బలగాల ఉపసంహరణ ప్రారంభమైంది. ఈ నెల 28-29 తేదీల్లోగా ఇది పూర్తవుతుందని అంచనా. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సమావేశంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య చర్చలు జరిగాయి. సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులను తొలగించి శాంతియుత వాతావరణం ఏర్పరుచుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి.

రచయితల కోసం ఓ గ్రామం

డెహ్రాడూన్: రచయితల కోసం ఓ ప్రత్యేక గ్రామాన్ని ఉత్తరాఖండ్‌లో ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రారంభించారు. డెహ్రాడూన్‌కు 24 కిలోమీటర్ల దూరంలోని ధానో గ్రామ సమీపంలో ఈ రచయితల గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రచయితలకు అనుకూలమైన నిశబ్ద, సృజనాత్మక వాతావరణాన్ని ఇక్కడ కల్పించారు.

జ్ఞానవాపీ కాంప్లెక్స్ మొత్తం సర్వేకు కోర్టు నో

వారణాసి, అక్టోబర్ 25: జ్ఞానవాపీ మసీదు కాంప్లెక్స్ మొత్తం ఏఎస్ఐ సర్వే చేయాలన్న హిందూ వర్గాల పిటిషన్‌ను వారణాసి కోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అడ్వొకేట్ విజయ్ శంకర్ రస్తోగీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. పురావస్తు పద్ధతులు, జీపీఆర్, జియో-రేడియాలజీ పద్ధతులను ఉపయోగించి ప్రస్తుతం ఉన్న నిర్మాణానికి ఎలాంటి నష్టం జరగకుండా మొత్తం కాంప్లెక్స్‌లో సర్వే నిర్వహించాలని కోరారు. ప్లాట్ నెంబర్ 9130లో ఉన్న జ్ఞానవాపీ ప్రాంగణం పక్కన ఉన్న 9131, 9132 ప్లాట్లతో అనుసంధానమై ఉందని.. ఆ రెండు ప్లాట్లు భగవాన్ ఆది విశ్వేశ్వరుడికి చెందినవని రస్తోగీ తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు తన పిటిషన్ కొట్టేయడంపై ఆయన స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులను పరిశీలించాక వాటి మీద జిల్లా కోర్టు లేదా అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలా వద్దా అనేది నిర్ణయిస్తానన్నారు.

షా విదేశీ పర్యటనల సమాచారమిస్తే 8.40 కోట్లు: పన్నూ

న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా విదేశీ పర్యటనల సమాచారం ఇచ్చినవారికి రూ.8.40 కోట్లు పారితోషికం ఇస్తానని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ ప్రకటించారు. నవంబర్ 26 నుంచి సీఆర్‌పీఎఫ్ స్కూళ్లను మూసేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణ దేవాలయంపై దాడి, 1984 నరమేధంలో సీఆర్‌పీఎఫ్ పాల్గొన్నదని.. ఈ కారణంగా సీఆర్‌పీఎఫ్ స్కూళ్లను బహిష్కరించాలని కోరారు.

బిష్ణోయ్ సోదరుని ఆచూకీ చెబితే 10 లక్షలు: ఎన్ఐఏ

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్‌మోల్ బిష్ణోయ్ ఆచూకీ చెప్పినవారికి రూ.10 లక్షలు బహుమతి ఇవ్వనున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించింది. ముంబైలోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఏప్రిల్‌లో కాల్పుల సంఘటనలో అన్‌మోల్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపించింది.

ఉపాధి 'హామీ' నిర్వీర్యం!

ఆరు నెలల్లో 84.8 లక్షల మంది కార్మికుల తొలగింపు

ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థతో మరిన్ని సమస్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: గ్రామీణ ప్రజల కడుపు నింపే ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కేంద్రం తూట్లు పొడుస్తున్నది. పథకం నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులను తొలగిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఆరు నెలల్లోనే 84.8 లక్షల మంది కార్మికులను ఈ పథకం నుంచి తొలగించారని లిబ్‌టెక్ అనే సంస్థ పేర్కొన్నది. ఉపాధి హామీ పథకం తీరుతెన్నులను ఈ సంస్థ ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నది. గత ఆరు నెలల కాలంలో కొత్తగా 45.4 లక్షల మంది కార్మికులు చేరారని, అంటే మొత్తం కార్మికుల సంఖ్య 39.3 లక్షలు తగ్గిందని ఈ సంస్థ పేర్కొన్నది. ఎక్కువ మందిని తొలగించిన రాష్ట్రాల్లో మొదట తమిళనాడు(14.7 శాతం), ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్(14.6 శాతం) ఉన్నాయి. కార్మికులను తొలగించడం కొన్నేండ్లుగా కొనసాగుతున్నదని, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం 8 కోట్ల మంది కార్మికులను తొలగించినట్టు లిబ్‌టెక్ పేర్కొన్నది.

తగ్గుతున్న పని దినాలు

ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత పని దినాలు తగ్గుతున్నాయని ఈ సంస్థ పేర్కొన్నది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 16.6 శాతం వ్యక్తిగత పని దినాలు(ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక కార్మికుడు పని చేసే రోజులు) తగ్గనున్నట్టు తెలిపింది. కాగా, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ(ఏబీపీఎస్)ను తప్పనిసరి చేయడం కార్మికులకు ఇబ్బందిగా మారింది. ఇందుకోసం కార్మికుల జాబ్ కార్డుకు ఆధార్ లింక్ అవ్వాలి. ఆధార్, జాబ్ కార్డుపై పేరు సరిగ్గా పొంతన కుదరాలి. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కావడంతో పాటు, ఎన్‌పీసీఐలో నమోదు కావాలి. వీటిల్లో ఏది లేకపోయినా కార్మికులుఏబీపీఎస్‌కు అనర్హులుగా మారుతున్నారని, మొత్తం కార్మికుల్లో 27.4 శాతం మంది అనర్హులుగా ఉన్నట్టు లిబ్‌టెక్ తెలిపింది.

సివిల్ సర్వీసులకు మరో 120 మంది ఎంపిక

న్యూఢిల్లీ: ఏటా సివిల్ సర్వీసుల్లోకి అభ్యర్థులను ఎంపిక చేసే యూపీఎస్సీ శుక్రవారం మరో 120 మంది అభ్యర్థులను సిఫార్సు చేసింది. రిజర్వ్ లిస్టులో ఉన్న వీరి పేర్లను విడుదల చేసింది. 2023లో నిర్వహించిన సివిల్ సర్వీస్ పరీక్షల తుది ఫలితాలను యూపీఎస్సీ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించింది. మొత్తం 1143 ఖాళీలకు 1,016 మందిని వివిధ సర్వీసులకు ఎంపిక చేశారు. అనంతరం డీఓపీటీ విజ్ఞప్తి మేరకు రిజర్వ్ లిస్టులో ఉన్న 120 మంది పేర్లను కూడా కమిషన్ ప్రకటించింది.

25కుపైగా విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: శుక్రవారం 25కుపైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. 7 ఇండిగో, 7 విస్తారా, 7 స్పైస్‌జెట్, ఆరు ఎయిరిండియా విమానాలకు శుక్రవారం భద్రతాపరమైన హెచ్చరికలు వచ్చాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని వివిధ విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయి.

భర్తను చెట్టుకు కట్టేసి.. భార్యపై గ్యాంగ్‌రేప్

మధ్యప్రదేశ్‌లో నవ వధువుపై దారుణం

మరో ఘటనలో మతిస్థిమితం లేని మహిళపై అఘాయిత్యం

భోపాల్, అక్టోబర్ 25: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలకు భద్రత కరువైంది. రెండు రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న రెండు లైంగికదాడి ఘటనలు రాష్ట్రంలో సంచలనం రేపాయి. రేవాలో సోమవారం దేవాలయం సమీపంలో పిక్‌నిక్‌కు వెళ్లిన యువ దంపతులపై ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. వారు భర్తను చెట్టుకు కట్టేసి, అతని ఎదుటే భార్యపై సామూహిక లైంగిక దాడి చేశారు. దానిని వీడియో తీసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆన్‌లైన్‌లో ఉంచుతామని బెదిరించారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు శుక్రవారం పోలీసులు తెలిపారు.

అర్ధనగ్నంగా రక్తమోడుతూ..

ఇండోర్‌లో 40 ఏండ్ల మతిస్థిమితం లేని మహిళ రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా చూసిన 20 ఏండ్ల యువకుడు ఆమెను పొలాల్లోకి తీసుకుని పోయి లైంగిక దాడి చేశాడు. బాధితురాలు ఒంటినిండా రక్తంతో అర్ధనగ్నంగా సాదర్ బజార్ ప్రాంతంలో వెళ్తున్న దృశ్యం సీసీ టీవీలో నమోదైంది. తర్వాత సోను అనే రోజువారీ కూలీని పెట్రోలింగ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. బాధితురాలిని దవాఖానకు పంపారు. రాష్ట్రంలో పెచ్చుమీరుతున్న అత్యాచారాలపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీ జీతూ పట్వారీ తీవ్రంగా మండిపడ్డారు. 'ఒక ఆడకూతురు అత్యాచారానికి గురై రోడ్లపై నగ్నంగా తిరుగుతుండగా, ముఖ్యమంత్రి మాత్రం ఒక ఈవెంట్‌లో బిజీగా ఉన్నారు' అని విమర్శించారు. రాష్ట్రంలో జంగిల్ రాజ్ ప్రభుత్వం నడుస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని, రోజుకు 18 నుంచి 20 మంది బాలికలు అత్యాచారానికి గురవుతున్నారని చెప్పారు.

భవనమే.. ఒక నగరం!

- *సౌదీ అరేబియాలో ప్రపంచంలోనే అతిపెద్ద భవనం*
- *రూ.4.20 లక్షల కోట్ల వ్యయంతో మహా నిర్మాణం*

రియాద్, అక్టోబర్ 25: ప్రపంచంలోనే అతి పెద్ద భవన నిర్మాణం ప్రారంభమైంది. 'ది ముకాబ్' పేరుతో సౌదీ అరేబియా ఈ నిర్మాణాన్ని చేపట్టింది. రాజధాని రియాద్‌లో చేపట్టిన కొత్త నగరం 'న్యూ మురబ్బా'లో దీనిని నిర్మిస్తున్నారు. 400 మీటర్ల ఎత్తు, వెడల్పుతో 'క్యూబ్' ఆకారంలో ఈ మహా నిర్మాణం ఉండనుంది. సౌదీ విజన్ 2030లో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణానికి ఏకంగా 50 బిలియన్ డాలర్లు (రూ.4.20 లక్షల కోట్లు)ను వెచ్చించనున్నారు. సౌదీ అరేబియా ప్రభుత్వ సంస్థ అయిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్(పీఐఎఫ్)లో భాగమైన న్యూ మురబ్బా డెవెలప్‌మెంట్ కంపెనీ(ఎన్ఎండీసీ) దీనిని నిర్మిస్తున్నది. 20 లక్షల మిలియన్ చదరపు మీటర్ల ఫ్లోర్ స్పేస్‌తో ఈ భవనం ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద భవనాల్లో ఒకటైన న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ లాంటివి 20 భవనాలు ఈ ఒక్క భవనంలో పడతాయి.

గోడలపై వర్చువల్ రియాలిటీ

సంప్రదాయ నాజ్డి నిర్మాణశైలికి ఆధునిక తను జోడించి ఈ ఆకాశహర్మ్యాన్ని నిర్మిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ భవనం పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. భవనం లోపలి గోడలకు అధునాతన వర్చువల్ రియాలిటీతో పాటు భారీ హోలోగ్రామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. లోపలికి అడుగుపెట్టగానే మరో ప్రపంచంలో ఉన్నామా అనే అనుభూతిని ఇవి కల్పించనున్నాయి.

సకల సౌకర్యాలు..

*ముకాబ్‌లో అనేక సదుపాయాలు ఉంటాయి. నివాసాలు, హోటళ్లు, షాపింగ్ మాళ్లు, కార్యాలయాలు, థియేటర్లు, మ్యూజియంలు, ఇలా ఒక నగరంలో ఉండాల్సిన అన్ని సదుపాయాలు, నిర్మాణాలు ఈ ఒక్క భవనంలోనే ఉంటాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ నివాస సదుపాయాలు ఇందులో ఉంటాయని పీఐఎఫ్ చెబుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం చమురుపైనే ఆధారపడకుండా, ఇతర రంగాల వైపు మళ్లించే లక్ష్యంతో సౌదీ అరేబియా చేపట్టిన ప్రాజెక్టుల్లో ముకాబ్ ము